ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు


మంగళవారం 3 డిసెంబరు 2024 | 5





పాడ్యమి దీపాల వెలుగులో పిఠాపురం పాదగయ పుష్కరిణి

అక్రమాలపై.. అష్టదిగ్బంధం



కాకినాడ పోర్టులో ఇటీవల బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్

- బద్దలవుతున్న కాకినాడ రేషన్ బియ్యం మాఫియా పునాదులు
- యథేచ్ఛగా వ్యవహరిస్తూ అడ్డంగా బరితెగించిన అక్రమార్కులపై సర్కారు వేట
- మాఫియాను అరికట్టడంపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం, డిప్యూటీ సీఎం
- నేడు కేబినెట్‌లోనూ దీనిపైనే ప్రధానంగా చర్చ: పలు కీలక నిర్ణయాలకు ఛాన్స్
- మరోపక్క పోర్టు లోపల గోదాముల్లో సార్టెక్స్ యంత్రాల గుట్టురట్టు
- రేషన్ బియ్యానికి పాలిష్ చేసే ఐదు యంత్రాలు ఉండడంపై సర్కారు సీరియస్
- గోదాముల యజమానులపై చర్యలకు ఆదేశించిన మంత్రివర్గ ఉపసంఘం

కాకినాడలో వారంతా ఐదేళ్లపాటు ఇష్టమొచ్చినట్లు బరితెగించారు. తమకు ఎదురే లేదని రెచ్చిపోయారు. పేదల బియ్యాన్ని అడ్డంగా బొక్కేసి సముద్రాలు దాటించేశారు. ఆఫ్రికా దేశాల్లో ఆకలిని సొమ్ము చేసుకుని వందలకోట్లు సంపాదించారు. పోర్టు, పౌరసరఫరాలు, రెవెన్యూ అన్ని శాఖలను గుప్పిట పెట్టుకుని అరాచకపర్వం సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొడుతున్న వరుస దెబ్బలకు రేషన్ మాఫియా అక్రమార్కులు అల్లాడుతున్నారు. ఎవరికీ కంటపడకుండా సాగిస్తున్న చీకటి దందాను కూకటివేళ్లతో పెకిలిస్తుండడంతో విలవిల్లాడుతున్నారు.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న మాఫియాను అరికట్టడానికి రాష్ట్రప్రభుత్వం సోమవారం పలు కీలక నిర్ణయాలు తీసుకోవడంతో మాఫియా వణుకుతోంది. సీఎం, డిప్యూటీ సీఎం దీనిపై సుదీర్ఘ చర్చించి మాఫియా సామ్రాజ్యాన్ని కూల్చడానికి ప్రత్యేక సబ్‌కమిటీ నియమించబోతున్నారు. నేడు కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నారు. అటు పోర్టు లోపల గోదాముల్లో ఐదు సార్టెక్స్ యంత్రాలను గుట్టుగా తరలించి రేషన్ బియ్యాన్ని పాలిష్ చేస్తోన్న గుట్టును సర్కారు రట్టుచేసింది. గోదాముల యజమానులపై కేసులతోపాటు బాధ్యులపై విచారణకు ఆదేశించింది.

ఎక్కడ చూసినా ఇదే..

కాకినాడ కేంద్రంగా సాగుతున్న వ్యవస్థీకృత రేషన్ బియ్యం ఎగుమతి మాఫియాపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇన్నేళ్లపాటు పేదల బియ్యాన్ని తినేసి ఎగుమతి చేస్తూ కోట్లకు కోట్లు సంపాదించిన ముఠా ఆటకట్టించడానికి వరుస పెట్టి కీలక అడుగులు వేస్తోంది. దీంతో ఇప్పుడు కాకినాడ రేషన్‌బియ్యం మాఫియా వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగుతోంది. ఈ మాఫియాను అరికట్టడంపై సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ సోమవారం భేటీ అయి సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల తాను కాకినాడపోర్టులో పర్యటించి రేషన్ బియ్యాన్ని గుర్తించడం, మాఫియా ఏస్థాయిలో రెచ్చిపోతోంది? తెరవెనుక ద్వారంపూడి సహకారం తదితర అంశాలను లోతుగా చర్చించారు. దీన్ని మొత్తం బయట కుతీసి ఇకపై మాఫియా ఆగడానికి ఏం చేయాలనే దానిపై ఇరువురు మాట్లాడారు. మొత్తం బండారం బయటకు లాగడానికి త్వరలో ఓ సబ్ కమిటీ వేయాలని నిర్ణయించారు. రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం సైతం సోమవారం కాకినాడ పోర్టు, మేరీటైం బోర్డు అధికారులతో చర్చించింది. డీప్‌వాటర్ పోర్టు నుంచి సైతం బియ్యం తరలిపోకుండా పర్యవేక్షణకు త్వరలో ఓ ఐపీఎస్ స్థాయి అధికారిని నియమించే విషయమై చర్చించింది. తద్వారా రేషన్ బియ్యం అనేది పోర్టుల ద్వారా ఎగుమతి చేయకుండా కట్టడి చేసే విషయమై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అయింది. ప్రస్తుతం యాంకరేజ్ పోర్టులో మాత్రమే బియ్యం తనిఖీకి, ఇతర భద్రతా వ్యవహారాల పర్యవేక్షణకు అధికారులు ఉన్నారు. ప్రైవేటు పోర్టులో ప్రభుత్వానికి సంబంధించి ఎవరూలేరు. ఇకపై కొత్తగా ఇక్కడా నిఘా పెరగనుంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021 నుంచి 23 వరకు లక్షల టన్నుల బియ్యం ఎగుమతి జరిగింది. ఈ సమయంలో కనీసం ప్రభుత్వం తరఫున తనిఖీలు లేవు. ఇకపై కొత్తగా నిఘా మొదలుపెట్టనున్నారు.

ఎంతకు తెగించారో...

కాకినాడ యాంకరేజ్ పోర్టులో ప్రభుత్వ, ప్రైవేటు గోదాములు చాలా ఉన్నాయి. ఎగుమతికి సిద్ధంగా ఉన్న బియ్యాన్ని ఇక్కడ నిల్వ చేస్తారు. రేషన్ మాఫియా వ్యక్తులు ఏకంగా ఈ ముసుగులో రేషన్ బియ్యాన్ని ఈ గోదాముల్లో ఉంచి సార్టెక్స్ యంత్రాలను లోపలకు తరలించి రేషన్ బియ్యానికి పాలిష్ చేసేస్తున్నారు. అక్కడినుంచి అక్కడికే నౌకలకు లోడింగ్ చేసేస్తున్నారు. దీనికి అసలు ఏమాత్రం తనిఖీల భయం ఉండదు. ఇదే విషయాన్ని మంత్రివర్గ ఉపసంఘం బయటపెట్టింది. పోర్టులోపల గోదాముల్లో అయిదు సార్టెక్స్ యంత్రాలు ఎందుకు ఉన్నాయని పోర్టు అధికారులను నిలదీసింది. సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు పోర్టులోపల గోదాముల్లో యంత్రాలేవీ ఉండకూడదు. మరి అలాంటప్పుడు ఇవి లోపలకు ఎలా వచ్చాయి? ఎవరు అనుమతించారు? అని నిలదీయడంతో అధికారులు బెంబేలెత్తిపోయారు. అక్రమార్కులకు సహకరిస్తోన్న విషయం బయటపడిపోవడంతో నీళ్లు నమిలారు. దీంతో వీటిని సీజ్ చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశాలు జారీచేసింది. ఈ గోదాముల యజమానులపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. సహకరించిన బాధ్యులపైనా విచారణకు ఆదేశించింది. దీంతో ఇప్పుడు కొందరు అధికారులు రేషన్ అక్రమార్కులతో తమకున్న సంబంధాలు బయటపడిపోవడంతో వణికిపోతున్నారు. జిల్లాలో గడచిన అయిదేళ్లలో రేషన్ బియ్యం రీసైక్లింగ్, అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ వారిపై నమోదైన కేసులను ప్రభుత్వం తిరగదోడుతోంది. వీటిపై విచారణ వేగవంతం చేయాలని సోమవారం రాత్రి కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో పోలీసుశాఖను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ పోర్టులో పర్యటించిన పవన్ బార్జిలో రేషన్‌బియ్యాన్ని గుర్తించి సీజ్ చేయించారు. ఈ సమయంలో హూ ఈజ్ అలీషా... హూ ఈజ్ అగర్వాల్ అని అధికారులను ప్రశ్నించారు. అలీషా గురించి పూర్తి నివేదిక పంపాలని కలెక్టర్‌ను శనివారం ఆదేశించారు. దీంతో పూర్తిస్థాయిలో అలీషా చరిత్ర, బియ్యం మాఫియా, వ్యాపారాలతో సంబంధాలపై వివరాలు సేకరించి నివేదికను సోమవారం పంపించారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణా రీసైకిలింగ్‌కు పాల్పడి వారిపై పటిష్టమైన నిఘా, నిశితమైన తనిఖీలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు, రీసైక్లింగ్ పాల్పడుతున్న వారిపై ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి విచారణ, అక్రమాలపై చేపట్టిన చర్యలపై సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు నిరోధానికి నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనుమానిత కార్యకలాపాలపై తనిఖీలు కొనసాగించాలన్నారు. జిల్లాలో గతంలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అక్రమ బియ్యం రవాణా, పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ పాల్పడుతున్న వారిపై నమోదైన కేసుల్లో దోషులపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు త్వరితగతిన లోతైన విచారణ చేయాలన్నారు. జూన్, జూలైల్లో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన తనిఖీల సందర్భంగా నమోదు చేసిన 13కేసులపై జరిపిన విచారణ, చేపట్టిన చర్యలపై సమీక్షించారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ ఐపీఎస్ అధికారిణి సుస్మిత, సీపీవో త్రినాథ్, ఇన్‌చార్జి డీఎస్‌వో లక్ష్మీప్రసన్నదేవి పాల్గొన్నారు.



పొలిపాడ్యమి దీపాల వెలుగులో.. పాదగయ పుష్కరిణి

- కార్తీకానికి వీడ్కోలు.. మార్గశిరానికి స్వాగతం

పిఠాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో నెలరోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించిన భక్తులు పోలిస్వర్గం(పోలిపాడ్యమి) సందర్భంగా ఆవునెయ్యితో అరటిడొప్పల్లో వెలిగించిన దీపాలను పాదగయ పుష్కరిణిలో వదిలారు. పిఠాపురం పట్టణంలోని పాదగయక్షేత్రం పాడ్యమి దీపాల వెలుగులను విరజిమ్మింది. సోమవారం తెల్లవారుజామున 2గంటలనుంచే భక్తులు పోటెత్తారు. మహిళలు, పురుషులు, చిన్నారులు పాడ్యమి దీపాలను ముందుగా నందీశ్వరుని వద్ద వెలిగించారు. తదనంతరం పాడ్యమి దీపాలను వెలిగించిన అరటిడొప్పలను పుష్కరణిలో వదిలి తులసిచెట్టువద్ద, ఆలయ ప్రాం గణంలో స్వామి, అమ్మ వార్లకు నైవేద్యాలు సమర్పించారు. పాదగయ పుష్క రణిలో పుణ్యస్నానాలు ఆచరించి కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురూహుతికా అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. బ్రాహ్మణులకు దానాలు(స్వయంపాకం) చేశారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామర్లకోట భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

సామర్లకోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పర్వదినాలు ముగింపు సందర్భంగా సామర్లకోట భీమేశ్వరస్వామి పుష్కరిణివద్ద, ఆలయాల్లోను సోమవారం తెల్లవారుజామున 4గంటలనుంచి మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చి పోలిస్వర్గం దీపపూజలు నిర్వహించారు. సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, హరిహరక్షేత్రం అన్నపూర్ణాసమేత రామలింగేశ్వరాలయంలోనూ జరిగిన విశేషపూజల్లో పాల్గొనేందుకు బారులుతీరారు. భీమేశ్వరాలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలోనూ, హరిహరక్షేత్రం ఆలయ వ్యవస్థాపకులు పరమానందగిరిస్వామి ఆధ్వర్యంలోను విశేష పూజలు చేశారు. భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆవరణలో మహాన్నదానం నిర్వహించారు. హెరిటేజ్ గణేష్ తదితర ఉమాశంకర్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

భీమేశ్వరునికి వైభవంగా ఝటాఝూట అలంకారం

కార్తీకమాసం ముగింపు పురస్కరించుకుని సామర్లకోట భీమేశ్వరాలయంలో సోమవారం స్వామివారిని వెండి ఝటాఝూట అలంకారంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ఆలయ పండితులు విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజశేఖరశర్మ వేదమంత్రోచ్ఛారణల మధ్య ఝటాఝూట అలంకారంతో భక్తుల దర్శనాలకు అనుమతించారు. బాలాత్రిపుసుందరి అమ్మవారిని, స్వామివారి మూలవిరాట్టును, ఉపాలయాల దేవతామూర్తులను, ఆలయ ఆవరణను రంగురంగుల పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వీరభద్రుడి సంబరం, తీన్‌మార్ డప్పుల వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.





భీమేశ్వరాలయం పూలతో అలంకరణ

ఆలయానికి వచ్చిన భక్తులు

ఉత్తమ బ్లడ్ బ్యాంకుగా రెడ్‌క్రాస్

- పురస్కారం అందజేసిన కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ)/కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా జిల్లా ప్రజలకు సురక్షిత రక్తాన్ని అందిస్తూ సేవలను అందిస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఉత్తమ బ్లడ్ బ్యాంక్ పురస్కారం అందుకుంది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుకు ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులకు రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. తదుపరి ఓఎన్జీసీ సంస్థ రెడ్‌క్రాస్ ద్వారా అందజేసిన పౌష్టికాహార కిట్లను హెచ్ఐవీ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్, సీపీఎం శైలజ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి కె.శివకుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న వైడీ రామారావు

ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పాట్లు

- నేలనంటిన వరిపంటను కోసేందుకు తప్పని ఇక్కట్లు

పిఠాపురం/గొల్లప్రోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కష్టాలు రైతులను వెన్నాడుతూనే ఉన్నాయి. తడిచిన దాన్యాన్నిఆరబెట్టుకునేందుకు పాట్లుపడుతున్నారు. ఎండకాసినా క్షణంలోనే మబ్బులు వేస్తుండడం, సాయంత్రానికి ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకోవడంతో ఆరబెట్టిన ధాన్యాన్ని రాశులుగా చేర్చి రక్షణ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. నేలనంటినవరి పంట మొలకెత్తకుండా ఉండేందుకు పలుచోట్ల ఉప్పు ద్రావణాన్ని పిచికారీచేస్తున్నారు.



పిఠాపురం మండలం కుమారపురంలో తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

ఏలేరు, పీబీసీ ఆయకట్టులో 1.07లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగైంది. ఇందులో 60శాతం విస్తీర్ణంలో వరికోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. ఇందులో ఎక్కువ శాతం వరికోత యంత్రాల ద్వారానే మాసూళ్లు జరగడంతో ధాన్యాన్ని కళ్లాలు, పొలాల్లోనే వదిలివేశారు. ఎన్ని రక్షణ చర్యలు చేపట్టినా, టార్పాలిన్లు, బరఖాలు కప్పినా రాశుల అడుగకి నీరు చేరడం, పలుచోట్ల కళ్లాల్లో నీరు నిలిచిపోవడంతో దాన్యం తడిచిపోయింది. సోమవారం తెల్లవారుజాము వరకూ వర్షం పడినా తదనంతరం వాతావరణంలో మార్పు వచ్చింది. ఎండకాయడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎండ, మబ్బులు దోబూచులాడటంతో రైతులకు ఆందోళన తప్పలేదు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో తడిచిన దాన్యం రాశులను రైతులు ఆరబెట్టారు. నీటిని బయటకు తొలగించి సురక్షిత ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించి అక్కడ లేదా రహదారుల వెంబడి ఆరబెడుతున్నారు. సాయంత్రం 4గంటల సమయంలో ఆకాశంలో దట్టంగా మేఘాలు అలముకోవడంతో హడావుడిగా రాశులుగా వేయడం కనిపించింది.

నేలనంటిన పంట మొలకెత్తకుండా..

తుఫాన్ కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న వరిపంటను కోయకుండా రైతులు వదిలివేశారు. ఇటువంటి ప్రాంతాల్లో వరిపంట గాలులు, వర్షం ప్రభావానికి నేలనంటింది. నేలకొరిగిన వరిపనలు రెండురోజులుగా వర్షపునీటిలో తడిచి ఉండడంతో మొలకెత్తే ప్రమాదముందని భావించిన రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. నేలకొరిగిన వరిపంటను వరికోత యంత్రాల సహాయంతో కోయడం లేదా మాసూళ్లు నిర్వహించడం సాధ్యపడదు. దీనివల్ల ఎకరానికి రూ.2వేల వరకూ తమపై అదనపు బారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

సీలు పడింది

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
- ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ సీజ్
- లంపకలోవ ఫ్యాక్టరీని మూసేసిన పీసీబీ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన రొయ్యల కంపెనీని అధికారులు మూసేశారు. కంపెనీలో భారీ ఉల్లంఘనలు బయటపడ్డంతో కంపెనీని సీజ్ చేస్తూ కాలుష్య నియంత్రణ మండలి సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. ప్రత్తిపాడు మండలం లంపకలోవలో నిర్వహిస్తున్న ఈ ఫ్యాక్టరీలో అడుగడుగునా కాలుష్య నిబంధనలు అతిక్రమిస్తున్నట్టు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) గుర్తించింది. వీటిని సరిదిద్దుకునేందుకు మూడు నెలలు గడువిచ్చినా అతీగతీ లేదు. అయినా సీజ్ చేయడానికి అధికారులు చర్యలు తీసుకోలేదు. దీనిపై గతనెల 30న ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. ఈ నేపథ్యంలో అధికారులు కంపెనీని మూసివేస్తు నిర్ణయం తీసుకున్నారు. మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడైన ద్వారంపూడికి కాకినాడ జిల్లాలో రెండు చోట్ల వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ పేరుతో రొయ్యల కంపెనీలున్నాయి. వీటిలో ఒకటి కాకినాడ సమీపంలోని కరప మండలం గురజనాపల్లిలో ఉంది. దీనిలో భారీగా కాలుష్య నిబంధనలను ఉల్లంఘించారని తేలడంతో ఇటీవల దానిని పీసీబీ సీజ్ చేసింది. ప్రత్తిపాడు మండలం లంపకలోవలోని మరో కంపెనీలోను భారీ కాలుష్య ఉల్లంఘనలను అధికారులు 11న గుర్తించారు. కంపెనీ రియల్ టైం పొల్యూషన్ తెలిపే ఆర్టీపీఎంస్ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండా వ్యర్థజలాలను నేరుగా బయట పంట కాలువల్లోకి వదిలేస్తోంది. ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఈటీపీ) లాగ్ బుక్‌ను జూలైలో తనిఖీ చేయగా కంపెనీ రోజుకు వాడాల్సిన 21,050 యూనిట్ల విద్యుత్లో 200 నుంచి 400 యూనిట్ల వరకు తేడాగా ఉందని, దీనికి కారణం ఈటీపీ వ్యవస్థను వాడకపోవడమేనని తేల్చారు. లోపల 20 టీపీడీ సామర్థ్యంతో కూడిన ఐస్‌ప్లాంట్ అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వ్యర్థజలాలను బయటకు విడుదల చేసే పైపులైన్ పలుచోట్ల దెబ్బతింది. కంపెనీ విడుదల చేస్తున్న ఏడు రకాల వ్యర్థజలాలను పరిశీలించగా పీసీబీ ప్రమాణాలకు లోబడి శుద్ధి చేయడంలేదని తేలింది. రొయ్యల శుద్ధిలో భాగంగా వచ్చే వ్యర్థాలను డిస్పోజ్ కంపెనీకి ఇవ్వాల్సి ఉండగా చాలా తక్కువ అప్పగించారని, మిగిలినదాన్ని అనధికారికంగా బయటకు పంపేస్తున్నారని వెల్లడైంది. ఈ లోపాలపై వివరణ కోరుతూ ఆగస్టు 8న నోటీసు జారీచేశారు. వీటికి కంపెనీ బదులిస్తూ, రియల్టైం పొల్యూషన్ మానిటరింగ్ సిస్టమ్(ఆర్టీపీఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చి త్వరలో పీసీబీ సర్వర్కు కనెక్ట్ చేస్తామని, ఇందుకు నవంబరు వరకు గడువివ్వాలని కోరింది. సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకూ మూడు నెలల వ్యవధి అడిగింది. వ్యర్థ జలాలను మూడు రోజులపాటు నిల్వ చేసేలా స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తామన్నారు. నవంబరు నెల ముగుస్తున్నా... వీటిలో ఏ ఒక్కటీ కూడా కంపెనీ సరిద్దిలేదు. గత నెల 21న పీసీబీ కమిటీ ఫ్యాక్టరీకి వచ్చి ఈ విషయాన్ని నిర్ధారించుకుంది.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 308 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి 308 అర్జీలు అందాయని జేసీ రాహుల్‌మీనా తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.రెవెన్యూ,పింఛన్లు,బియ్యం కార్డులు, ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్లస్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణలు తొలగింపు వంటివి అర్జీల్లో ఉన్నాయి. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు,కేఎస్ఈజడ్ ఎస్డీసీ రామలక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 47 అర్జీలు

కాకినాడ క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు వారి సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 47 మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కరరావు, ఎస్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ అధికారిణి సుస్మిత పాల్గొన్నారు.

తీరం దాటిన ఫెంగల్ తుఫాన్

- ఉప్పాడలో ధ్వంసమైన బీచ్‌రోడ్డు

కొత్తపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ తీరం దాటింది. తుఫాన్‌లో సమయంలో ఉవ్వెత్తున ఎగసిపడిన రాకాసి అలలు బలంగా బీచ్‌రోడ్డుకు తాకడంతో రోడ్డు ధ్వంసమైంది. ఉప్పాడ శివారు కొత్తపట్నం, విద్యుత్‌ప్లాంటు, నేమాం సమీపంలో బీచ్‌రోడ్డుకు గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కాలంలో గోతులను మరమ్మత్తు చేసేందుకు వేసిన కంకర కెరటాలు ధాటికి కొట్టుకుపోయింది. రోడ్డు రక్షణకు ఏర్పాటు చేసిన బండరాళ్లపైనుంచి కెరటాల విరుచుకుపడడంతో బండరాళ్ల మధ్యలో ఉన్న చిన్న రాళ్లు పైకి లేచి బీచ్‌రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రయాణిం చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తపల్లి మండలంలోని మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు గతంలో నిర్మించిన జియోట్యూబ్ టెక్నాలజీ తుఫాన్ కారణంగా ఎగసిపడిన కెరటాల ఉధృతికి నామరూపాలు లేకుండా పోవడంతో కెరటాలు మత్స్యకారుల ఇళ్లల్లోకి చొచ్చుకొపోయాయి. ఎన్నో తుఫాన్‌ల బారినుంచి సముద్ర తీరప్రాంత గ్రామాలకు రక్షణ కవచంగా సేవలందించిన జియోట్యూబ్ టెక్నాలజీని మళ్లీ ఏర్పాటు చేసి సముద్ర తీర గ్రామాలను రక్షించాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కెరటాల ధాటికి ధ్వంసమైన ఉప్పాడ బీచ్‌రోడ్డు

ఫార్మా కంపెనీకి అమ్ముడుపోయిన మత్స్యకార నాయకులపై చర్యలు చేపట్టండి

- పిఠాపురం జనసేన ఇన్‌చార్జి ద్వారా డిప్యూటీ సీఎంకు మత్స్యకారుల ఫిర్యాదు



పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డిని కలిసిన కోనపాపపేట మత్స్యకారులు

కొత్తపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత మత్స్యకారుల జీవితాలను ఫార్మా కంపెనీకి రూ.6కోట్లకు అమ్ముడుపోయిన మత్స్యకారుల నాయకులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కొత్తపల్లి మండల పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన మత్స్యకారులు జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కోనపాపపేటలో 3వేలమంది సంప్రదాయ మత్స్యకారులు వేట జీవనాధారంగా జీవనోపాధి పొందుతున్నారని వారు పేర్కొన్నారు. పెరుమాళ్లపురంలో నెలకొల్పిన రసాయన పరిశ్రమలు, వాటి నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలతో మత్స్యసంపద అంతరించిపోయే ప్రమాదం ఉందని, మత్స్యకారులతో దశలవారీ పోరాటం చేశామన్నారు. తమ పోరాటాన్ని నీరు గార్చేందుకు తమ గ్రామంలోని మత్స్యకార పెద్దలు కొందరు రసాయన పరిశ్రమల ప్రతినిధులు ఇచ్చిన సొమ్ములకు అమ్ముడుపోయి, తమకు తీరని ద్రోహం చేశారని, వీరిపై విచారణ చేయించి మత్స్యకారులకు న్యాయం చేయాలని జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కార్తీకానికి వీడ్కోలు


పాడ్యమి దీపాల వెలుగులో రాజమహేంద్రవరం గోదావరి తీరం

- భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి

అంతా శివనామస్మరణే. కార్తీకానికి వీడ్కోలు పలుకుతూ భక్తులు పోలి స్వర్గం (పోలి పాడ్యమి) సందర్భంగా అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి నదుల్లో వదిలారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి పాడ్యమి దీపాలు వెలిగించి పూజలు చేశారు.


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో పాడ్యమి దీపాలు వదులుతున్న భక్తులు


కార్తీక మాసం ముగింపు వేళ దక్షిణ కాశీగా పేర్గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు


పంచారామ క్షేత్రం సామర్లకోటలో వెండి జటాఝూట అలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వదులుతున్న భక్తులు


కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లిలో మహిళల పూజలు


జగ్గంపేటలో పాడ్యమి దీపాలు వెలిగిస్తున్న మహిళ


రాజమహేంద్రవరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


బ్రాహ్మణునికి దీపదానం (రాజమహేంద్రవరంలో)


పెళ్లి మండపాలు రెడీ


ఎ.వేమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

మాసానాం మార్గశీర్షోహం

మార్గశిర మాసంలో పండుగలెన్నో.. డిసెంబరు 25 వరకు పెళ్లి సందడి

అమలాపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభో శివశంకరా.. అంటూ తన్మయత్వంతో భక్తుల శివనామస్మరణలతో ఈ ఏడాది కార్తీకమాసం ముగిసింది. కార్తీకం అలా వెళ్లగానే శివకేశవులకు బేధం లేదంటూ హరినామస్మరణలతో ఈనెల 2 నుంచి మార్గశిరమాసం ప్రారంభమైంది. మాసానాం మార్గశీర్షోహం అని గీతాచార్యుడు శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. మాసాల్లో మార్గశీర్షం తానేనని శ్రీకృష్ణ భగవానుడు ప్రకటించాడు. మార్గశిర మాసంలో హరినామాన్ని నోరారా పలికితే సకల శుభాలు కలుగుతాయని గోదాదేవి తిరుప్పావై ప్రబంధంలో పలుమార్లు పేర్కొంది. కలియుగంలో హరినామస్మరణను మించినది లేదని పురాణాలు చెబుతున్నాయి. శ్రీవైష్ణవులకు పరమ పవిత్రమైన ఈ మాసంలో శ్రీరంగనాథుడిని ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి పాడిన తిరుప్పావై పాశురాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. అంతేకాకుండా ఈ మాసంలోనే సంక్రాంతి పండుగ సందడి కూడా ప్రారంభమవుతుంది. సంక్రాంతి నెల రోజుల పండుగతో ఇళ్లు రంగురంగుల రంగవల్లులతో సంక్రాంతి శోభను సంతరించుకుంటాయి. అటువంటి మార్గశిర మాసంలో వచ్చే పండుగలెన్నో. ఈ నెల 2న మార్గశిర మాసం ప్రారంభం కాగా 16న ధనుర్మాసం ప్రారంభమవుతుంది. డిసెంబరు 7న సుబ్రహ్మణ్య షష్ఠి జరుపుకుంటారు. ఆ రోజున జరుపుకునే కార్తికేయ పూజకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 11న భగవద్గీత ఆవిర్భవించిన గీతాజయంతిని జరుపుకుంటారు. 13న హనుమద్వ్రతం జరుపుకుంటారు. ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహిస్తారు. అంతే కాకుండా ప్రదోష వ్రతం పేరున శివుడిని పూజిస్తారు. 15న మార్గశిర పూర్ణిమను పురస్కరించుకుని దత్తాత్రేయ జయంతిని నిర్వహిస్తారు. 16న సంక్రాంతి పండుగకు నెలపట్టుట. ధనుర్మాసం ప్రారంభం. 18న సంకష్టహర చతుర్థి రోజున వినాయకుని పూజలు జరుపుతారు. 22న కాలభైరవాష్టమి నిర్వహిస్తారు. కాలభైరవుడిని పూజించడం ద్వారా సకల కష్టాలను, దోషాలను అధిగమించవచ్చు.

4 నుంచి 25 వరకు ముహూర్తాలు



మార్గశిర మాసంలో జరుపుకునే పండుగలకు కొదవేలేదు. దానికి తోడు ఈ మాసంలో వివాహాది శుభ ముహూర్తాలు ఎక్కువే. ఈ నెల 4 నుంచి 25 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. దీంతో ఏ వీధిలో చూసినా పెళ్లి సందడే కనిపించనుంది. ఈనెల 4,5,6,7, 10,11,20,25 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ఈ మాసంలో శంకుస్థాపనలు చేయరు. ఇక గృహప్రవేశాలకు కూడా ముహూర్తాలు అధికంగానే ఉన్నాయి. ఈనెల 4,6,7,9,10,17,22,24 తేదీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు ఉన్నాయి.

- కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి,
పంచాంగకర్త
బండారులంక


ముమ్మిడివరంలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గిరిశర్మ

ఆయనో అర్చకుడు.. గోసేవకుడు

ముమ్మిడివరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆయనో అర్చకుడు.. ఆదాయం అంతంతమాత్రమే. అయినా తనకు వచ్చే ఆదాయంలో సగం గోవుల సంరక్షణకు ఖర్చు చేస్తుంటారు. దేవుడితోపాటు గోవులకు సేవచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముమ్మిడివరం శ్రీలక్ష్మీగణపతి ఆలయ అర్చకుడిగా పని చేస్తున్న వెలువలపల్లి గిరిశర్మ స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ. పద్దెనిమిదేళ్ల కిందట ముమ్మిడివరం వచ్చారు. భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉండడానికి సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వర్తక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అర్చకత్వం చేస్తున్నారు. నెల జీతం పది వేలలోపే. ఇదికాక భక్తులు ఇచ్చే ఐదో, పదో దక్షిణతోనే జీవనం. దీంతోపాటు హోమాలు, పెళ్లిళ్లు వంటి కార్యక్రమాలకు వెళతారు. కానీ ఈయనకు వచ్చే ఆదాయంలో రోజుకు 15 నుంచి 20 వీధి పశువులకు (ఆవులు, ఆబోతులు) ఉదయం, సాయంత్రం దాణా పెడుతుంటారు. అంటే రోజూ రూ.200 నుంచి రూ.250 ఖర్చు అవుతుంది. ఏదైనా పశువుకు అనారోగ్యానికి గురైతే వైద్య సేవలు అందిస్తుంటారు. వాటికి రెండు పూటలా దాణా పెట్టి నిమరందే తనకు నిద్ర పట్టదని గిరిశర్మ చెబుతారు. ఇలా గిరిశర్మ గోసేవతో తరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.


గోవులకు దాణా పెడుతున్న గిరిశర్మ


ప్రత్తిపాడు -వెల్దుర్తి రహదారిలో నర్సరీలో మొక్కల పెంపకం

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో రంగురంగు పూలతో చూపరులను ఆకర్షిస్తున్న నర్సరీ

నర్సరీల మెట్ట.. ఎట్టెట్టా!



మొక్కలతో పాటు పూల కుండీల తయారీ

- మెట్ట ప్రాంతంలో నర్సరీల విస్తరణ
- గండేపల్లి టు తుని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు
- చూపరులను ఆకట్టుకుంటున్న వివిధ రకాల మొక్కలు
- ప్రత్తిపాడులోను రెండు చోట్ల పెద్ద నర్సరీలు
- మొక్కల పెంపకంతో స్థానికులకు ఉపాధి
- శుభకార్యాలకు పూల అమ్మకాలు కూడా ఇక్కడే

గండేపల్లి/ప్రత్తిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెట్టలో నర్సరీలా.. ఆశ్చర్యంగా ఉంది కదూ.. అసలు నర్సరీలు పేరు చెప్తే ఠక్కున గుర్తొచ్చేది కడియపులంక పేరే.. ఆ ప్రాంతంలోనే ఎక్కువగా నర్సరీలుంటాయి. పూలు, డెకరేషన్, ఇతరత్రా ఏమొక్కలు కావాలన్నా గోదావరి జిల్లాల్లో ఎవరైనా అక్కడికి వెళ్లి రావాల్సిందే. కానీ ఈ రెండు, మూడేళ్లలో మెట్ట ప్రాంతంలోనూ నర్సరీలు విస్తరిస్తున్నాయి. దీంతో ఇక్కడే రకరకాల పండ్ల, పుష్పాల మొక్కలు లభ్యమవుతున్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో నర్సరీలు రెండు మూడేళ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. 16వ నెంబరు జాతీయ రహదారి పక్కనే గండేపల్లి మొదలుకొని తుని వరకు విస్తరించాయి. ప్రారంభంలో ఒక్కొక్కటిగా మొదలైన నర్సరీలు ప్రస్తుతం 15 వరకు ఏర్పాటయ్యాయి. మెట్ట ప్రాంతమైన గండేపల్లి మండలంలోని మురారి, గండేపల్లి, నీలాద్రిరావుపేట, జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లిలో రెండుచోట్ల, కిర్లంపూడి, ప్రత్తిపాడు, తుని మండలాల పరిధిలోను కొన్నిచోట్ల నర్సరీలు ఏర్పాటుచేశారు. ప్రత్తిపాడు మండలం బవురువాకలోను 50 ఎకరాల్లో ఒక నర్సరీ ఉంది. ఇదే మండలంలోని ఒమ్మంగిలోను 30 ఎకరాల్లో ఓ నర్సరీని విస్తరించారు. ఇక ప్రత్తిపాడు మండలం ధర్మవరం నుంచి పిఠాపురం వెళ్లే రహదారిలోని వెల్దుర్తిలోను ఓ నర్సరీ ఉంది. గండేపల్లి-తుని మధ్య హైవే పక్కనున్న నర్సరీల్లో పూలు, వివాహాలకు ఉపయోగించే పూల మొక్కలు, డెకరేషన్ సామగ్రి లభ్యమవుతోంది. ఈ నర్సరీల్లో రంగు రంగుల పూల మొక్కలు కనిపించడంతో హైవేపై వెళ్లేవారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాటిని చూసి ఆగి చాలామంది కొనుగోలు చేస్తున్నారు. కడియపులంకను తలపించేలా మెట్ట ప్రాంతంలో నర్సరీల ఏర్పాటుపై పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల చాలా మందికి ఉపాధి కలుగుతోంది. ఆయా గ్రామాల్లో ఉండే మహిళలు నర్సరీల్లో మొక్కల పెంపకం, వాటి నిర్వహణ పనులు చూస్తున్నారు. దీంతో వారికి నిత్యం పని దొరుకుతోంది. ఇలా ఈ పనులపై ఆధారపడి 200 మందికిపైగా మహిళలు, యువత ఉపాధి పొందుతున్నారు. కొందరు కడియపులంక నుంచి ఇక్కడకు వచ్చి ఈ నర్సరీలను నిర్వహిస్తున్నారు. స్థానికులు కూడా కొందరు మొక్కల పెంపకంపై ఆసక్తితో నర్సరీలు నడుపుతున్నారు. దీంతో మొక్కలు కావాలంటే కడియపులంకే కాదు.. ఇక్కడే కొనొచ్చని మెట్టవాసులు చెబుతున్నారు.


నర్సరీ పనిలో..

సత్యదేవునికి...

కాసులు కురిపించిన కార్తీకమాసం

అన్ని విభాగాల ద్వారా రూ.21.13 కోట్ల ఆదాయం



స్వామివారి ఖజానాకు చేరిన నోట్ల కట్టలు



స్వామి, అమ్మవార్లు

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈ ఏడాది కార్తీకమాసం కాసులు కురిపించింది. ఇప్పటికే వ్రతాల నిర్వహణలో ఆల్ టైం రికార్డు నెలకొల్పగా తాజాగా సోమవారం హుండీల లెక్కింపుతో కార్తీకమాస ఆదాయాన్ని అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాల ద్వారా రూ.21,13,82,068 ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే రూ.45 లక్షల ఆదాయం అధికంగా వచ్చింది. ఈ ఆదాయం రికార్డుగా నిలిచింది. ప్రధానంగా వ్రతం టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.8.33 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.4.86 కోట్లు, హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.04 కోట్లు, సత్రం గదుల అద్దెల ద్వారా రూ.1.43 కోట్లు స్వామివారికి సమకూరింది. గతేడాది కంటే అన్ని విభాగాల ద్వారా ఆదాయం పెరగగా లీజులు విభాగం వసూళ్లు, ఇతర మిస్‌లీనియస్ ఆదా యపరంగా గతేడాదితో పోలిస్తే రూ.2.64 కోట్లు తగ్గింది. కార్తీకమాసంలో సుమారు కోటి మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు.

హుండీల ఆదాయం రూ.1.30 కోట్లు

సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.1,30,30,404 నగదు, 52.500 గ్రాముల బంగారం, 1125 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటు పలు దేశాల కరెన్సీ లభించింది. 13 రోజులకు ఈ ఆదాయం సమకూరింది. సరాసరిన రోజుకు రూ.10.02 లక్షలు చొప్పున భక్తులు హుండీల్లో కానుకల రూపంలో సమర్పించారు. సిబ్బంది లెక్కించగా చైర్మన్ రోహిత్, ఈవో త్రినాథరావు పర్యవేక్షించారు.

గతేడాది కార్తీకమాస ఆదాయం, ఈ ఏడాది కార్తీకమాసం ప్రధాన విభాగాల ఆదాయం ఈ పట్టికలో చూడవచ్చు.

విభాగము	2023(రూ.లో)	2024 (రూ.లో)
వ్రతం టిక్కెట్ల విక్రయాలు	7.03 కోట్లు	8.33 కోట్లు
ప్రసాదం విక్రయాలు	4.38 కోట్లు	4.86 కోట్లు
హుండీలలో వచ్చిన కానుకలు	2.81 కోట్లు	3.04 కోట్లు
సత్రం గదుల అద్దెల ద్వారా	89.98 లక్షలు	1.43 కోట్లు
కల్యాణ మండపాలు	5.47 లక్షలు	8.41 లక్షలు
ప్రత్యేక దర్శనాలు	67.01 లక్షలు	85.82 లక్షలు
ఏసీ వ్రతాల నిర్వహణ	47.60 లక్షలు	60.45 లక్షలు
రవాణా విభాగం	27.03 లక్షలు	40.81 లక్షలు
లైసెన్స్ ఇతర ఆదాయాలు	3.73 కోట్లు	1.09 కోట్లు



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు



సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న దంపతులు పూజలు



వేదాశీర్వచనం పొందుతున్న అంతర్జాతీయ స్విమ్మర్ శ్యామల దంపతులు

సామర్లకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, సీఎం.పేషీ అధికారి ప్రద్యుమ్న సతీసమేతంగా భీమేశ్వరాలయం చేరుకుని స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో పాటు ప్రసాదాలు... స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. అంతర్జాతీయ స్విమ్మర్ అవార్డు గ్రహీత గోలి శ్యామల తన భర్త గోలి మోహన్‌తో కలిసి భీమేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ లడ్డూలు అందజేత

భీమేశ్వర స్వామికి ఝుటా జుటం అలంకరణ పురస్కరించుకుని సామర్లకోట లయన్స్ క్లబ్ ప్రతినిధి అమలకంటి శ్రీనివాసరావు సౌజన్యంతో ఒక్కొక్కటి 30 కిలోల పరిమాణంలో గల 3 భారీ లడ్డూలను ఆలయంలో అలంకరణ నిమిత్తం అందజేశారు. గత 15ఏళ్లుగా ఇస్తున్నరీతిలోనే ఈ సారి కూడా లడ్డూలను అందజేశారు. పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య లడ్డూలను స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ల ఎదుట అలంకరించారు. మంగరాజు, బుల్లియ్య, మురళీ పాల్గొన్నారు. స్వామివారికి వెండి ఝుటా జుటం అలంకరణ సందర్భంగా దాతల సౌజన్యంతో ఆలయ ఆవరణను వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పలు ప్రధాన మండపాల వద్ద పండ్లతో అలంకరించారు. పూలతో ఓం నమఃశివాయ పేరిట అక్షర క్రమాన్ని ఆలయం నలువైపులా అలంకరించారు.



భీమేశ్వరునికి అందజేసిన భారీ లడ్డూలు

ప్రాచీన ఆలయాల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే పూజలు



బిక్కవోలులో ఎమ్మెల్యే శంకర్‌ను సత్కరిస్తున్న షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను సోమవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దర్శించారు. లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు గొర్రెల త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీనివాస్, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

నేడు ఏపీటీలో పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం

కాకినాడరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన ప్రాంతీయస్థాయి పాలీటెక్ ఫెస్ట్ మంగళవారం ప్రారంభంకానుందని ప్రిన్సిపాల్ ఎన్.జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనకు జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని, సుమారు 2000 మంది టెక్‌ఫెస్ట్‌లో పాల్గొననున్నారన్నారు. రెండు రోజుల పాటూ జరిగే ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.25000, రెండవ బహుమతి రూ.10,000 బహుకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రాంతీయ సాంకేతిక విద్యాశాఖాధికారి జె.సత్యనారాయణ పాల్గొంటారని ఆయన చెప్పారు.

48 గంటలపాటు మద్యం బంద్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- ఉభయగోదావరి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలకు నిబంధన వర్తింపు
- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 48గంటలపాటు మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలకు ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఈనెల 5వతేదీ సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలను ఏపీ ప్రభుత్వ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఆదేశాల మేరకు బంద్ చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయ ఎమెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే లక్ష్యంతో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించామని ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో సమర్థంగా నిర్వహించాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో జె.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారులు, సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉండగా 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ జిల్లాలో ప్రత్యేకంగా 3418 మంది ఓటర్లు ఉండగా వారి కోసం 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఈనెల 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సురక్షితంగా కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తామని ఆయన తెలిపారు. తొలుత పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పీవో డైరీ, మైక్రో అబ్జర్వర్ల విధులు, ఫర్నీచర్, విద్యుత్తు, పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆదాయం రూ.50.43లక్షలు

ఐ.పోలవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేతవీరేశ్వరస్వామి కార్తీక మాస ఆదాయం రూ.50,43,680 వచ్చినట్టు ఆలయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గతం కంటే ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. నిత్యకల్యాణం, పంచామృతాభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు, ఇతర సేవల రూపంలో రూ.41,46,452, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,45,985, అన్నదాన ట్రస్టు ద్వారా రూ.7,51,043 సమకూరినట్టు ఆయన వివరించారు. వీరేశ్వరస్వామి ఆలయం టెంపుల్ టూరిజం ప్యాకేజీలో ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు. ఆలయ ప్రాశస్త్యం పెరగడంతో ఆలయ గ్రేడ్ కూడా 6-ఎ నుంచి సహాయ కమిషనర్ హోదాకు చేరుకుందన్నారు. కార్తీక మాసంలో అన్నివిధాలా సహకరించిన అన్ని శాఖల ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కుటేశునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కొలువయి ఉన్న స్వయంభూ కుక్కుటేశ్వరస్వామికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష పూజలు అనంతరం స్వామిని ఝుటా జుటంతో అలంకరించారు. స్వామిని భక్తులు దర్శించుకున్నారు.



పాదగయ క్షేత్రంలో ఝుటా జుటం అలంకరణలో కుక్కుటేశ్వరస్వామి

కుమార్తెను చూసేందుకు వెళుతూ...

వ్యాన్ ఢీకొనడంతో తండ్రి మరణం



వ్యాన్ చక్రాల కిందకి వెళ్లిపోయిన యాక్టివా బండి



మరణించిన ధనకొండ (ఫైల్)

సర్పవరం జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కుమార్తెను పరామర్శించేందుకు వెళుతూ...మార్గ మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం గొడారిగుంట వీఎస్ లక్ష్మీకాలేజీ సమీపంలో జరిగింది. కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన మత్స్యకారుడు దాసరి ధనకొండ (45)కు భార్య సరస్వతి, అబ్బాయి ఆకాశ్, కుమార్తె మానస ఉన్నారు. అతడు స్థానిక ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు పట్టిన చేపలకు వేలంపాట పాడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమార్తెను ప్రసవం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా ఇటీవల శస్త్రచికిత్స చేసి ప్రసవం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కుమార్తెను పరామర్శించేందుకు సోమవారం సాయంత్రం యాక్టివా బండిపై బయలుదేరి వలసపాకల సెంటర్ నుంచి గొడారిగుంట మీదుగా ఆస్పత్రికి పయనమయ్యాడు. ఈ క్రమంలో బొందగుంటలో వీఎస్ లక్ష్మీకాలేజీ దాటిన తర్వాత శశికాంత్‌నగర్ రోడ్డు నాలుగురోడ్ల సెంటర్‌లో వ్యాన్ ఢీకొనడంతో బైక్ వ్యాన్ కిందకి వెళ్లిపోగా ధనకొండ తలకు తీవ్ర గాయంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన అతడిని స్థానికులు చికిత్స కోసం సమీపంలోని లక్ష్మీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమార్తెను చూసి వచ్చేస్తానంటూ ఇంటి నుంచి బైక్‌పై వెళ్లిన కొద్దిసేపటికే భర్త మరణవార్త విన్న భార్య కుప్పకూలిపోయింది. పొద్దుపోయింది, ఈ రోజు వద్దు రేపు వెళ్లమని చెప్పినా వినకుండా ఈ రోజే కుమార్తెను చూసి వచ్చేస్తానంటూ వెళ్లిన భర్త ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతాడని కలలో కూడా అనుకోలేదని కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాదసమాచారం తెలిసిన వెంటనే సర్పవరం సీఐ బి పెద్దిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

హత్యగా స్థానికుల వెల్లడి
పోలీసుల దర్యాప్తు



దానయ్య మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో హత్యకు గురైన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని టీబీ ఆసుపత్రి వెనుక భాగంలోని ధనమ్మగుడి వీధికి చెందిన బట్టు దానయ్య అలియాస్ దాలి (35) గతంలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసేవాడు. అయితే అతడు అప్పటికే పాత నేరస్తుడు. పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ఏ పనికి వెళ్లకుండా తాగి జులాయిగా తిరిగేశాడు. అతడికి పెళ్లి కాలేదు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారు జామున సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ పక్క సందులోని సిమెంట్ రోడ్డుపై దానయ్య రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. అది గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని దానయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. అయితే ముగ్గురు ఆగంతకులు రాడ్‌లతో దానయ్యను కొట్టి చంపినట్టు స్థానికులు చెబుతున్నారు. సీసీకెమెరాల పరిశీలనలో కూడా ఇదే విషయం వెల్లడైనట్టు తెలుస్తుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్ నుంచి స్వగ్రామానికి రమేష్ మృతదేహం



పేరవరంలో రమేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం దుబాయ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన అంగర రమేష్(35) మృతదేహం సోమవారం ఉదయం స్వగ్రామం చేరుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన రమేష్ ఉపాధి కోసం దుబాయ్‌లోని డేరా ప్రాంతంలోని ఓ ప్రవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత నెల 15న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దుబాయ్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామం రప్పించడం కోసం మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు సాగించడంతో దుబాయ్ నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు రమేష్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. సోమవారం కుటుంబ సభ్యులు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి పేరవరం స్వగ్రామానికి తీసుకువచ్చారు. బంధుమిత్రులు రమేష్ మృతదేహం వద్ద బోరున విలపించారు. భార్య కవిత, ఇద్దరు కుమారులు మాకు దిక్కెవ్వరంటూ రోదించారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో...

జేఎన్టీయూకే జట్టుకు ప్రథమస్థానం



టేబుల్ టెన్నిస్ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

జేఎన్టీయూకే, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో జేఎన్టీయూకే కళాశాల జట్టు ప్రథమస్థానంలో నిలిచినట్టు వర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా రెండు యూనివర్శిటీల సెలక్షన్‌లను కూడా సాధించారన్నారు. ఈ జట్టు ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకూ తమిళనాడులోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో జరగనున్న యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచిన టీటీ జట్టు, శిక్షణ నిచ్చిన పీడీలను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, శ్యామ్‌కుమార్ అభినందించారు.

గెద్దాడలో ఓఎన్జీసీ పైపులైను స్వల్ప లీకేజీ

మరమ్మతులు నిర్వహించిన అధికారులు



పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ-వేగివారిపాలెం సరిహద్దులో ఓఎన్జీసీకి చెందిన పైపులైను స్వల్పంగా లీకైంది. లీకేజీని గుర్తించిన స్థానికులు ఓఎన్జీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పైపులైను ద్వారా గ్యాస్ సరఫరాను నిలుపుదలచేసి మరమ్మతు చర్యలు చేపట్టారు. తాటిపాక స్ట్రక్చర్‌లోని తాటిపాక 6వ బావి నుంచి పైపులైను ద్వారా నగరం జీసీఎస్‌కు గ్యాస్ సరఫరా అవుతుంది. పైపులైనుకు లీకేజీ ఏర్పడిన పైపును సుమారు 10నుంచి 12అడుగుల మేర తొలగించి కొత్త పైపును ఏర్పాటు చేశారు. ఈ బావి నుంచి ఉత్పత్తి అవుతున్న సహజవాయువు హెచ్చుతగ్గుల్లో ఉండడం వల్ల ఇటీవల డ్రిల్లింగ్ నిర్వహించారు. తరువాత ఈ బావి నుంచి గ్యాస్ ఉత్పత్తి పెరిగిందని సంబంధిత అధికారులు తెలియచేశారు. లీకేజీ అయిన పైపులైనుకు మరమ్మతులు నిర్వహించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ల రికవరీ సులభం

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ



ఫిర్యాదుదారుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీ సులభం అవుతోందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న/దొంగతనానికి గురైన సందర్భాల్లో వెంటనే సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో 450 సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశారు. చాట్‌బాట్/ సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకూ 1843 సెల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. సెల్ ఫోన్లు దొరికినా, బిల్లుల లేని ఫోన్లను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి అందజేయాలన్నారు. దొంగతనానికి గురైన సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన వారు కూడా చిక్కుల్లో పడకతప్పదని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా, సైబర్ క్రైం టీం ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సిబ్బందిని అభినందించారు.

కార్మిక నేతలపై కేసులు కొట్టివేత

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివీస్ వ్యతిరేక ఉద్యమంలో కార్మిక నేతలపై పోలీసులు పెట్టిన కేసులను కాకినాడ జిల్లా తుని కోర్టు సోమవారం కొట్టేసింది. 2016లో దివీస్ ఉద్యమకారులపై నమోదైన కేసులు ఎనిమిదేళ్ల పాటు కోర్టులో నడిచాయి. అనేక మంది సాక్షులను విచారించారు. పూర్వాపరాలను పరిశీలించి తుని మేజిస్ట్రేట్ తీర్పు ఇవ్వడంతో ఉద్యమకారులపై నమోదైన 10 కేసులు తుని కోర్టు కొట్టేసింది. రెండు కేసుల్లో 13 మంది ఉన్నారు. ఈ కేసును అడ్వకేట్ మల్లేశ్వరరావు వాదించారు.

సిగరెట్ కోసం..

మద్యం మత్తులో ఇద్దరి మధ్య కొట్లాట

తీవ్రంగా గాయపడి
చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మరణించిన వీరబాబు

మండపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిగరెట్ కోసం ఇద్దరి మధ్య మద్యం మత్తులో జరిగిన సంఘర్షణ వ్యక్తి ప్రాణాలను తీసింది. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండపేటలోని ఎస్సీకాలనీ 7వవార్డులో ఉన్న విశ్రాంతి మందిరంలో కాలనీకి చెందిన సుందరపు వీరబాబు నిద్రిస్తున్నాడు. అతడి వద్దకు అదే కాలనీకి చెందిన వేమగిరి సురేష్ తాగి వచ్చి చలిగా ఉంది సిగరెట్ కావాలని అడిగాడు. వీరబాబు తన వద్ద సిగరెట్ లేదని చెప్పాడు. సిగరెట్ కోసం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మాట మాట పెరిగి కొట్లాటకు దారితీయడంతో సురేష్ వీరబాబుపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని ఆదివారం రాత్రి 108వాహనంలో మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరబాబు(35) సోమవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. వీరబాబుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనపై రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ దొర్రాజు విచారణ చేపట్టారు. క్లూస్‌టీం డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మండపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై ఎరుపుతెలుపు గీతల చొక్కా, పట్టుపంచె, పసుపురంగు తువ్వాలు ఉన్నాయి. స్థానికులు మండపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మద్యం దుకాణాల వద్ద నిబంధనలు తూచ్

● మామూళ్లమత్తులో జోగుతున్న అధికారులు

కరప, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మద్యం దుకాణాలవద్ద నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పర్మిట్‌రూమ్‌లకు అనుమతులు లేకున్నా మద్యం వాపారులు తమ షాపుల వద్ద మందుబాబులు కూర్చోవడానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కరపలోని ఒక వైన్‌షాపువద్ద రెల్లిగడ్డితో పలు పాకలు ఏర్పాటుచేయడంతో మందుబాబులు అక్కడే తాగుతూ ఊగుతున్నారు. కరపలో మరో వైన్‌షాపు వెనుక కుర్చీలు, బల్లలు వేసి అనధికారికంగా పర్మిట్‌రూమ్ నడుపుతున్నారు. నడకుదురు పరిధిలో ఉన్న మూడు దాబా రెస్టారెంట్లకు అదే గ్రామంలోని ఒక వైన్‌షాపు నుంచి మద్యం సరఫరా అవుతోంది. సదరు మద్యంవ్యాపారి దాబా నిర్వాహకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ దాబాల్లో అనధికారికంగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నాడు. గురజానాపల్లిరోడ్, వేళంగి, గొర్రిపూడి గ్రామాల్లోని వైన్‌షాపులవద్ద దర్జాగా నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. పలుమద్యం దుకాణాల్లో ఇష్టారాజ్యంగా లూజు అమ్మకాలు జరుగుతున్నాయి. నిరాటంకంగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాలను ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకే నిర్వహించాలన్న నిబంధనకు పాతరేసి అన్నివేళలా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల మందుబాబులకు ఉచితంగా స్టఫ్ అందిస్తూ అమ్మకాలను పెంచుకుంటున్నారు. మద్యంపై 20శాతం మార్జిన్ లభిస్తుందని వ్యాపారులు ఆశించారు. ఆచరణలో 10శాతం మాత్రమే గిట్టుబాటవుతుండడంతో మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నట్టు తెలుస్తోంది. నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు మామూళ్లమత్తులో జోగుతూ పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) సిబ్బంది వచ్చి ఇక్కడ బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహిస్తున్నారంటే స్థానిక ఎక్సైజ్‌శాఖాధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కరపలోని ఒక వైన్‌షాప్ వద్ద మందుబాబుల కోసం ఏర్పాటుచేసిన పాకలు


పాకల్లో కూర్చుని తాగుతున్న మందుబాబులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

8న అన్నవరంలో ఐలాజ్ రాష్ట్ర మహాసభ

● పిఠాపురంలో కరపత్రాలు ఆవిష్కరించిన న్యాయవాదులు



ఐలాజ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

పిఠాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) మొదటి రాష్ట్ర మహాసభ ఈనెల 8న కాకినాడజిల్లా అన్నవరంలోని శేషాద్రిసదన్‌లో జరుగుతుంది. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం జరిగిన కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ఇతర ప్రతినిధులు ఆవిష్కరించారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ న్యాయవాదుల ప్రయోజనాలు, ప్రజల హక్కులను కాపాడటంలో ఐలాజ్ ముందుంటుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. న్యాయవిద్య చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, మానవ, పౌరహక్కుల కోసం పోరాడే న్యాయవాదులపై ప్రభుత్వాలు నిరంకుశ చట్టాలు ప్రయోగించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర కన్వీనర్ బుగతా శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు పిల్లా రాజు, బార్ ప్రతినిధులు ఎస్ఎం ఆలీ, ఎం.సత్యవతి, ముమ్మిడి శ్రీనివాసరావు, ఉదయభాస్కర్, అరుణ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

సర్పవరంజంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో సత్వర న్యాయ పరిష్కారం లభిస్తుందని న్యాయవాది యనమల రామం తెలిపారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ పలు కేసుల్లో రాజీపడదగ్గ కేసుల్లో ఇరువురు కక్షిదారులు లోక్ అధాలత్‌లో సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ నెల 14న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

పెద్దాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదలాడలో షష్ఠి ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు చెందిన పోస్టర్‌ను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆవిష్కరించినట్లు కమిటీ సభ్యుడు కె.త్రిమూర్తులు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అక్రమ లేఅవుట్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

తాళ్లరేవు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు సర్వేనెం.405/2బిలో 2.45సెంట్లులో నాన్ లేఅవుట్‌వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పన్నులు, రెవెన్యూ కన్వర్షన్ చెల్లించకుండా, పంచాయతీకి మినహాయింపు భూమిని కేటాయించకుండా వేసిన నాన్‌లేఅవుట్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కేవీఎస్ కన్వర్షన్‌పై ఫిర్యాదు

పి.మల్లవరం సర్వేనెం221/1ఎ2ఎ3, 4,5,బి1లో 1.44సెంట్లు భూమిని కన్వర్షన్ చేయకుండా నాన్ లేఅవుట్‌చేసి సర్వేనెం .211లో 50సెంట్లు భూమిలో రెవెన్యూ కన్వర్షన్ ప్రభుత్వ అనుమతులు లేకుండా కేవీఎస్ కన్వర్షన్ చేపట్టారని దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చొల్లంగి మాజీ ఉపసర్పంచ్ కొంకి వెంకటరమణ జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నకిలీ పట్టాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎంపీటీసీల వినతి


నకిలీ పట్టాలను చూపుతున్న దృశ్యం

కాకినాడ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జరుగు తున్నందున తూరంగిలో నకిలీ పట్టాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీటీసీలు పితాని వెంకటరాము, వాసంశెట్టి త్రిమూర్తులు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాము, త్రిమూర్తులు మీడియాతో మాట్లాడుతూ గత రూరల్ తహసీల్దార్ మురార్జీ పనిచేసిన కాలంలో జగనన్న ఇళ్ల పట్టాలు మినహా పొజిషన్, డీ పట్టాలు ఎన్ని మంజూరు చేశారో తెలపాలని సహచట్టం ప్రకారం కోరగా ఏమీ మంజూరు చేయలేదని సమాధానం ఇచ్చారన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ నకిలీ పట్టాలను ఇంటిప్లాన్, కరెంటు కనెక్షన్, ఇంటి పన్నులకు ఉపయోగిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకురాగా ప్రస్తుత తహసీల్దార్ ఎన్‌వోసీ లేకుండా అనుమతులు మంజూరు చేయరాదని అధికారులను ఆదేశించారన్నారు. తూరంగిలో ప్రభుత్వ భూముల ఆక్ర మణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 అర్జీలు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ సూచించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు జరిగిన డయల్ యువర్ కమిషనర్‌కు 8మంది ఫోన్ చేసి సమస్యలు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 36 అర్జీలు స్వీకరించినట్లు అదనపు కమిషనర్ సుధాకర్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎస్ఈ కామేశ్వరరావు, మేనేజర్ శిరీష్, అకౌంటెంట్ సత్యనారాయణ, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నీటిసంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కరప, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన నిర్వహించే నీటిసంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ నాగభవానీలు సిబ్బందికి సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశమందిరంలో సోమవారం ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. మండలంలో 9 నీటిసంఘాలు ఉన్నాయని, దీనికి సంబంధించి ఈనెల 5న నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. ఎన్నికల విధివిధానాలు, అనుసరించాల్సిన చర్యలను ఎన్నికల సిబ్బందికి వివరించి వారి సందేహాలను నివృత్తిచేశారు.

పెద్దాపురం: ఈనెల 5న నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె పాల్గొని సోమవారం మాట్లాడారు. మండల పరిధిలోని పెద్దాపురం, పులిమేరు, కట్టమూరు, కాండ్రకోట, తిరుపతి గ్రామాలకు సంబంధించి ఐదు నీటి సంఘాలకు ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

పీజీఆర్ఎస్‌కు తొమ్మిది అర్జీలు

పెద్దాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యా లయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు తొమ్మిది అర్జీలు అందినట్లు ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి తెలిపారు. ప్రతీ అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా కృషిచేస్తామన్నారు.

పీడీఎస్ బియ్యం దొంగలను అరెస్టు చేయాలి

● పోర్టు అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి
● 30వేల మంది కార్మికులను రోడ్డున పడవేయరాదు
● డిప్యూటీ సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు లేఖ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మధు

కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, పీడీఎస్ బియ్యం ఎగుమతులు చేస్తున్న దొంగలను అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు పంపిన లేఖలో కోరారు. ఈ సందర్భంగా సోమవారం సీపీఐ నగర సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్ బియ్యం ఎగుమతుల్లో ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రమేయం ఉందనే కారణంతో కాకినాడ పోర్టును దిగజార్చరాదని, దీనిపై ఆధారపడిన 30వేలమంది కార్మికులను రోడ్డున పడవేయరాదన్నారు. పోర్టు ద్వారా పీడీఎస్ బియ్యం ఎగుమతి జరుగుతుంటే ముందుగానే గొడౌన్‌ల్లో తనిఖీ చేయాలని, రైస్‌మిల్లుల్లో సీసీ కెమెరాలు పెట్టి పూర్తిగా నిఘా ఉంచాల న్నారు. కాకినాడ పోర్టు కార్మికులకు పనిలేకుండా పోతోందని కూటమి ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ పాల్గొన్నారు.

కొండబాబును కలిసిన వైఎంవీఏ నూతన కార్యవర్గం


ఎమ్మెల్యే కొండబాబును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న వైఎంవీఏ నూతన కార్యవర్గ సభ్యులు

కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ది యంగ్మెన్స్ వైశ్యఅసోసియేషన్(ఆర్య వైశ్య యువజన సంఘం) నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అంతకుముందు వైఎంవీఏ హాల్‌లో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చెక్కా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా కారుమూరి కిరణ్, పరిపాలనా కార్యదర్శిగా చెక్కా కామందు, ఆర్థిక కార్యదర్శిగా గ్రంధి వెంకట నరసింహ నీల్, గ్రంథాలయ కార్యదర్శిగా తాళ్లూరి రాజేష్, క్రీడల కార్యదర్శిగా గుపుపూడి సతీష్‌కుమార్, పీఆర్‌వోగా అద్దేపల్లి గంగరాజు ఎన్నికయ్యారు.

'జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించి ఉపాధి కల్పించాలి'


కలెక్టరేట్ వద్ద నిరసనదీక్ష చేస్తున్న కార్మికులు

కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏలేశ్వరం మండలం చిన్నింపేటలోని ఇంటర్‌స్నాక్ జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించి ఉపాధి కల్పించాలని సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆ పరిశ్రమకు చెందిన కార్మికులు నిరసన దీక్ష చేశారు. ఈ పరిశ్రమను అర్థంతరంగా మూసి వేయడంవల్ల చుట్టుపక్కల 24గ్రామాలకు చెందిన 409 మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని వాపోయారు. ఈ ఫ్యాక్టరీలో పదేళ్లుగా పనిచేస్తూ కుటుంబాలకు పోషించుకుంటున్నామని తెలిపారు. అభ్యంతరాలు లేకుండానే గతనెల 16న అర్ధరాత్రి ఈ పరిశ్రమ గేటుకు తాళాలు వేసి యాజమాన్యం వెళ్లిపోయిందన్నారు. పరిశ్రమను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడిపించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పెదబ్రహ్మదేవం, వేట్లపాలెంలో ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణం తనికీలు చేస్తున్న డీడీ హరి

సామర్లకోట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలోని లక్ష్మీకళ్యాణి ఎంటర్‌ప్రైజెస్, వేట్లపాలెం సత్యసాయి ఏజన్సీస్ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర ఉపస ంచాలకు వీవీఎస్ .హరి ఆధ్వర్యంలో వ్యవసాయాధికారుల బృందం సోమవారం సాయంత్రం వరకూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగుమందుల విక్రయాలకు చెందిన ఫార్మ్ ఓ, పీసీలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లుబుక్‌లు, అమ్మకపు, కొనుగోలు రిజిస్టర్లు తనిఖీలు చేశారు. రైతులకు ఇవ్వాల్సిన బిల్ కాపీ ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో కాకుండా వ్యత్యాసం ఉన్నందున రెండు దుకాణాలలో రూ.8,03,635ల విలువ గల నిల్వలకు స్టాప్‌సేల్స్ నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయాధికారి సంజీవ్‌కుమార్, మండల వ్యవసాయాధికారిణి ఐ.సత్య తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల సంరక్షణకు తోడ్పాటు

90 శాతం రాయితీపై మినీ గోకులాలు మంజూరు


రమణయ్యపేటలో గోకులం నిర్మాణానికి గోతులు తవ్వుతున్న కూలీలు, షెడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీవో గణేష్

సర్పవరంజంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నోరులేని మూగజీవాలకు నిలువనీడ కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల అభ్యున్నతితో పాటూ పాడి పశువుల సంరక్షణ కోసం గోకులాలు మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం నిధులతో జాబ్‌కార్డు కలిగిన వారు, చిన్న, సన్నకారు పాడి పరిశ్రమ రైతులకు రాయితీపై గోకులాలు మంజూరు చేసింది. అయిదేళ్ల వైసీపీ పాలనలో అన్నిరంగాలతో పాటూ పాడిపరిశ్రమ దెబ్బతింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ గోకులాలను జగన్ ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అన్నదాతల సమస్యతో పాటూ పాడిపరిశ్రమ, కోళ్ల రైతుల కష్టాలను తీర్చేందుకు గోకులాలను మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చింది. కాకినాడ రూరల్ మండలానికి 50 గోకులాలు మంజూరు చేసింది. పశువులు నివసించేందుకు వీలుగా రేకుల షెడ్డు, పశువులు ఒకేసారి ఆహారం తినేందుకు వీలుగా సిమెంట్ ప్లాట్ పారమ్ పోర్షన్, నీరు తాగేందుకు నీటితొట్టెల నిర్మాణ పనులు ప్రారంభించారు.

గోకులం పథకం వివరాలివిగో... కాకినాడరూరల్‌కి 50 గోకులాలు

నాలుగు పాడిపశువులు, ఆవుల గోకులం యూనిట్ రూ.1.85 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో 90శాతం ప్రభుత్వ రాయితీ పోగా లబ్ధిదారుడు 10శాతం రూ.18,500లు చెల్లిస్తే సరిపోతుంది. ఆరుపశువులు, ఆవుల గోకులం యూనిట్ ఖరీదు రూ.2.30 లక్షలు కాగా, సబ్సిడీపై రూ.23 వేలుకు ఏర్పాటు చేసుకోవచ్చు. రెండు పశువులు, 20 మేకలు, గొర్రెలున్న యూనిట్ ఖరీదు రూ.1.30 లక్షలు కాగా, రూ.39 వేలు చెల్లించాలి. 50 పశువులంటే రూ.2.30 లక్షల యూనిట్ రాయితీపై రూ.69 వేలు చెల్లించాలి.

ఉపాధి పథకంతో గోకులాల నిర్మాణం: గణేష్, ఏపీవో

పాడి రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో 50 మినీ గోకులాలు మంజూరు చేసింది. పాడి పశువుల ఆధారంగా యూనిట్ ఖరీదులను ప్రభుత్వం నిర్ణయించింది. 90 శాతం రాయితీపై 10 శాతం లబ్ధిదారుని వాటాతో యూనిట్ మంజూరు చేసింది. డిసెంబరు నెలాఖరు నాటికి నిర్ధేశించిన గోకులాలు నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఏపీవో గణేష్ తెలిపారు.

కార్తీక మాసానికి వీడ్కోలు

కొత్తపల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): నెల రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసిన కార్తీకమాస ప్రత్యేక పూజలు సోమవారంతో ముగిశాయి. తెల్లవారుజామున భక్తులందరూ అరటి డొప్పలతో పాడ్యమి దీపాలు వెలిగించి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు. కొత్తపల్లి శ్రీ బాలత్రిపురసుందరీ రాజశేఖరస్వామి ఆలయం, ఉప్పాడ శ్రీ చౌడేశ్వరిసమేత రామలింగేశ్వరస్వామి ఆలయాలవద్ద ధ్వజస్తంభాల వద్ద కార్తీకదీపాలను వెలిగించి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు.

భీమేశ్వరుడికి ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు

సామర్లకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి రుటారూట అలంకారం పురస్కరించుకుని సోమవారం సాయంత్రం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వామివారికి పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు చేశారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీష్‌మోహన్ తదితర టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస నగర సంకీర్తన

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి బండారు వీధి రామాలయంలో నెలరోజులు పాటు నిర్వహించిన కార్తీకమాస నగర సంకీర్తన కార్యక్రమం సోమవారంతో ముగిసింది. భజన గురువులను సత్కరించారు. క్షేత్రదర్శిని కార్యక్రమంలో భాగంగా 40మంది భక్తులు అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి పయనమై వెళ్లారు. కార్యక్రమంలో బత్తుల వీరభద్రం, తుమ్మూరి శ్రీరామారావు, సైలా శ్రీనివాస్, కాకి సత్యనారాయణ, నక్కా గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం గుడ్లు సరఫరాపై మానవహక్కుల సంఘం ఆగ్రహం


నాసిరకంగా ఉన్న గుడ్లను చూపిస్తున్న మానవహక్కుల సంఘం నేతలు

పెద్దాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించకపోవడంపై జిల్లా మానవహక్కుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక సాగర్ మున్సిపల్ పాఠశాలను సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ తన బృందంతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం రూ.కోట్ల వ్యయంతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహా రాన్ని అందించేందుకు ఖర్చు చేస్తున్నా కాంట్రాక్టర్ల ధనదాహానికి అంతే లేకుండా పోయిందన్నారు. పాఠశాల విద్యార్థులకు చిన్నసైజు ఉండే గుడ్లు మధ్యాహ్న భోజనంలో అందించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇటువంటి పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు సరైన మరుగు దొడ్లు లేవని, అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. మూడు వందల మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం సభ్యులు కుంచే నానిబాబు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

5న శ్రీప్రకాష్‌లో రాష్ట్రస్థాయి టీటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పెద్దాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ కార్యక్రమం ఈనెల 5న స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో నిర్వహిస్తామని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. విలేఖరులతో ఆయన సోమవారం మాట్లాడారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైనవారు ఈనెల 20నుంచి 22వ తేదీ వరకూ జరిగే రాష్ట్ర, అంతర్‌జిల్లా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ రమణయ్యపేట శివారు గైగోలుపాడు శుభానికేతన్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొంతు సూర్యనారాయణ (70) మృతి చెందాడు. కొత్త గైగోలుపాడుకి చెందిన సూర్యనారాయణ సర్పవరం రహదారిలో శుభానికేతన స్కూల్ సమీపంలో స్థానిక శంకర్ టవర్ అపార్టుమెంట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో వృద్ధుడు అక్కడక్కడే మృతి చెందాడు. సర్పవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెహ్రూ విద్యాసంస్థల చైర్మన్ ఆదినారాయణ మృతి


ఆదినారాయణ (ఫైల్)

కాకినాడసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని నెహ్రూ విద్యాసంస్థల చైర్మన్, సీనియర్ విద్యావేత్త ఎం.ఆదినారాయణ(80) ఆదివారం రాత్రి స్థానిక అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో మృతి చెందారు. అర్ధ శతాబ్ది కాలం క్రితం కాకినాడలో ఎయిడెడ్ విద్యాసంస్థలు నెలకొల్పి విద్యావ్యాప్తికి కృషిచేశారు. ఆదినారాయణ సతీమణి ఎం.లక్ష్మీతులసి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్నారు. ఆయన కుమారుడు మతుకుమిల్లి శ్రీ వి.జయ్ హైకోర్టు న్యాయవాదిగా, రాష్ట్ర ప్రైవేటు విద్యాసంస్థల ఫెడరే షన్ లీగల్ అడ్వయిజర్‌గా వ్యవహరిస్తున్నా రు. ఈమేరకు రాష్ట్ర, జిల్లా ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, సిబ్బంది సంతాపం తెలిపారు.

పని కల్పించాలని ఉపాధి కూలీల ఆందోళన

● ఫీల్డ్‌అసిస్టెంట్ తీరుపై ఏపీవోకు ఫిర్యాదు


ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధి కూలీలు

కరప, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తమకు పని కల్పించాలని కోరుతూ కరప మండలపరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం కరపకు చెందిన పలువురు ఉపాధి కూలీలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఫీల్డ్‌అసిస్టెంట్ గత మూడు వారాలుగా తమకు పనికల్పించడంలేదని ఆరోపించారు. కొత్తపేట, నీలయ్యతోట, మెరకవీధిలకు చెందిన కూలీల విషయంలో క్షేత్రసహాయకుడు పక్షపాతంగా వ్యవహరిస్తూ మిగిలినవారికి పని కల్పిస్తున్నాడని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి వెంటనే తమకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్‌ను కలిసి ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై ఫిర్యాదుచేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న అధికారులను కలిసి ఉపాధి కూలీలకు జరుగుతున్న అన్యా యంపై చర్చించారు. వెంటనే వారికి పని కల్పించాలని కోరారు. ఉపాధి కూలీలు పెనుబోతుల నర్సింహమూర్తి, భేరి వెంకటరమణ పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆదేశించినా చర్యలు శూన్యం

● ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆగని వాణిజ్య సముదాయాల నిర్మాణం
● లేఖలు రాశామని చెబుతున్న మున్సిపల్ కమిషనర్
● కౌన్సిల్ మాటకు విలువ ఇవ్వని అధికారులు
● నిర్మాణాలు నిలుపుదల చేయలేకపోతున్న మున్సిపల్ అధికారులు


ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కొనసాగుతున్న వాణిజ్య సముదాయాలు

పెద్దాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అనధికారికంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదా యాలను మున్సిపల్ అధికారులు నిలుపుదల చేయడంలో విఫల మవుతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఈవియంపై అధికారులను నిలదీసినా కూడా వారిలో చలనం లేదు. ఓవైపు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మొత్తుకుంటున్నా కూడా వారి మాటలను మున్సిపల్ అధికారులు ఖాతరు చేయడంలేదు. పైగా ఆర్టీసీ అధికారులకు లేఖలు రాశామని చెప్పడం చూస్తుంటే వారి నిర్లక్ష్యం ఏవిధంగా ఉందో తెలుస్తోంది. ఈవిషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం మీనవేషాలు లెక్కించడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతం కావడంతో పలువురు ఈనిర్మాణాల పట్ల భయాందోళన చెందుతున్నారు. పైగా ఆర్టీసీ అధికారులు ఈవిష యంలో ప్రజల ప్రాణాలు లెక్కలేనట్లు నిర్మాణాలు నిలుపుదల చేయకుండా కొనసాగించడంతో జనాగ్రహానికి గురవుతున్నారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని వివరణ కోరగా టీపీవోను నిర్మాణాలు నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక

తొండంగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం తొండంగిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగింది. అధ్యక్షురాలుగా బోడపాటి చంటమ్మ, ఉపాధ్యక్షురాలిగా సన్ని లక్ష్మి, కార్యదర్శిగా కె.కృష్ణవేణి, సహ కార్యదర్శిగా నేమాల మంగ, కోశాధికారిగా కాలిన బేబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 72 గ్రామ సంఘాల ప్రతినిధుల సమక్షంలో ఏపీఎం సత్తిబాబు ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు,,

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలి పాడ్యమి ప్రత్యేక పూజలు



గౌరీదేవి సంబరంలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి రోజు పోలి పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఐ.పోలవరం గోవిందగిరి వేంకటేశ్వర స్వామి, నారాయణగిరి వేంకటేశ్వరస్వామి, రంప భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, మద్దివీడు భ్రమరాంబిక సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునే మహిళలు కార్తీక దీపాలను అరటి డొప్పల్లో వెలిగించి నీటిలో వదిలారు. గౌరీగవర సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి ఆధ్వర్యంలో గౌరీదేవి సంబరం జరిపించినట్టు ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు.

డొంకరాయిలో పూజలు



మోతుగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో మహిళలు తెల్లవారుజామున సీలేరు నదీ తీరాన పూజలు చేసి అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి నదిలో వదిలిపెట్టారు. పోలమ్మను ఎలా స్వర్గానికి పంపించావో మమ్మల్ని కూడా అలానే స్వర్గానికి పంపించి గోరంత పసుపు, కుంకుమ తీసుకుని కొండంత పసుపు, కుంకుమను మాకు ఇవ్వు అంటూ దామోదరుని స్తుతించారు.

జమాల్‌ఖాన్ ట్రస్టు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కూనవరం, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): గడ్డ నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుమారుడు రాజేష్‌కు జమాల్‌ఖాన్ ట్రస్టు ద్వారా రూ.5వేలు ఆర్థిక సాయాన్ని టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు సోమవారం అందజేశారు. మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, గడేశుల ప్రేమ్‌చంద్, చలకాని ఉమామహేశ్వరరావు, ఎస్‌కే వహీద్, సునీల్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే జరిమానా



ప్లాస్టిక్ నిషేధంపై వారపు సంతలో అవగాహన

వై.రామవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని, ఎవరైనా వినియోగిస్తే జరిమానా విధిస్తామని దుకాణదారులు, హోటళ్ల యజమానులను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న హెచ్చరించారు. సోమవారం ఆమె వై.రామవరం వారపు సంతలో ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులకు కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు.

అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

మోతుగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం మంగంపాడులో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను 1974 నవంబరు 28న స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చదువు కున్న విద్యార్థులంతా సోమవారం కలుసుకున్నారు. పాఠశాలకు వచ్చి తరగతి గదిలో కూర్చుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. అప్పటికీ ఇప్పటికీ జరిగిన మార్పులు, అభివృద్ధిని చూసి ఆనందించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. వారంతా ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. తామంతా ఇక్కడ చదివి మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో బాగా స్థిరపడ్డామని... మీరు కూడా కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన మంగంపాడు గ్రామ పెద్ద సర్వం కోట అబ్బాయిరెడ్డి, నైనిలింగారెడ్డి, కొట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యాధికారులు సస్పెన్షన్

రంపచోడవరం, డిసెం బరు 2(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిం చిన ఇద్దరు వైద్యాధి కారులను సోమవారం సస్పెండ్ చేసినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలి పారు. వై.రామవరం మండలం గుర్తేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు జగదీష్‌నాయక్, రాజు రాజేష్ విధులకు హాజరకావట్లేదని ఫిర్యాదు అందడంతో సస్పెండ్ చేశామన్నారు. గిరిజన ప్రాంత పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మె ల్యే మిరి యాల శిరీషదేవి సోమ వారం తన క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. అటవీ అభ్యంతరాలతో నిలిచి పోయిన రోడ్డు పనులు చేపట్టాలని, పింఛన్లు మంజూరు చేయాలని, అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని అర్జీదారులకు ఆమె హామీ ఇచ్చారు.

కొండమొదలు ఉద్యమ వీరుల వర్ధంతి



మాట్లాడుతున్న రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

రంపచోడవరం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): కొండమొదలు ఉద్యమవీరులు కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య వర్ధంతి సభను స్థానిక భాను కల్యాణ మండపంలో సర్పంచ్ వేట్ల విజయ అధ్యక్షతన సోమ వారం నిర్వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, ఏఐకేఎంఎస్ జాతీయ సహ కన్వీనర్ సింహాద్రి ఝాన్సీ మాట్లా డుతూ 1982 కొండమొదలు భూపోరాటంలో పోలీసుల కాల్పుల్లో రాజులు, లక్ష్మయ్య అమరులయ్యా రన్నారు. అనాటి ప్రజల ఐక్య పోరాట ఫలితంగా భూములకు సాగు హక్కులు సాధించు కోగలిగామన్నారు. ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షుడు ఇల్లా రామిరెడ్డి, కార్యదర్శి తాతి బుల్లబ్బాయిరెడ్డి, రైతు కూలీ సంఘం నాయకుడు వంజం జోగారావు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న 'చలో విజయవాడ'

దేవీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మం కోసం జనవరి 5వ తేదీన 'చలో విజయవాడ' నిర్వహిస్తున్నట్టు బీజేపీ ప్రధాన కార్యదర్శి హైందవ శంఖారావం కన్వీనర్ కుండ్ల సాయిరాం తెలిపారు. సోమవారం మండలంలోని కొండమొదలు పంచాయతీలోని పెద్దభీంపల్లి-3 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. హిందువులంతా ఒకతాటిపైకి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హిందుత్వం మా విధానం-హిందుత్వం మా నినాదమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నడిపూడి భానుశంకర్‌రెడ్డి, ముర్ల బాపూజీరెడ్డి, నూకలేటి కామేశ్వర్‌రెడ్డి, నెల్లూరి శివరెడ్డి, మడకం శివ, కాలుముల రామన్న పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

దేవీపట్నం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు-1 ఏనుగులగూడెం గ్రామంలో సోమవారం దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





గండేపల్లి మండలం మల్లేపల్లిలో జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, బాలికలు, రౌతులపూడిలో పాడ్యమి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు

గండేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజును మల్లేపల్లిలోని నీలికుండీలతోట రామాలయ ఆవరణలో సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామిని పల్లకిలో ఉంచి బాజాభజంత్రీలు, కోలాట నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామమంతా ఊరేగించారు. సుమారు 500 మంది మహిళలు జ్యోతులను శిరస్సున పెట్టుకుని భజన గీతాలు పాడారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. స్వామిని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, గండేపల్లి తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు, ఎస్‌ఐ శివనాగబాబు, మండల పరిషత్ ఏవో చంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ రవికిరణ్, ప్రసాద్ దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటేశులు, తెలగరెడ్డి భద్రరావు, దార్లంక శ్రీనివాస్, కంచర్ల సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు చేశారు. సింగలూరి రామ్‌దీపు, రామకుర్తి నరసింహం, పితాని వీరబాబు, రామకుర్తి బ్రహ్మజీ, మణికంఠ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): ఆలయాలు, ఇళ్ల వద్ద మహిళలు పోలి పాడ్యమి దీపాలు వెలిగించారు. స్థానిక శివాలయం, విష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బ్రాహ్మణులకు దీపదానాలతో పాటు స్వయంపాకాలు అందజేశారు. సర్వకామదాంబ సమేత ఉమా చంద్రశేఖరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో పోలి పాడ్యమిని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తాండవ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అరటి డొప్పల్లో దీపాలు వదిలారు. అనంతరం బ్రాహ్మణులకు స్వయం పాకం అందజేశారు. కోటనందూరు, కేవీ అగ్రహా రం, భీమవరపుకోట, అల్లిపూడి, బంగారయ్యపేట గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుష్కర, పోలవరం కాలువలు, చెరువులు, శివాలయాల వద్ద మహిళలు వేకువజాము నుంచే పాడ్యమి దీపాలు వదిలి కార్తీకానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ధర్మవరం నంది సెంటర్లో నంది విగ్రహాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. లంపకలోవ, రాచపల్లి, ఏలూరు, ధర్మవరం గ్రామాల్లో నగర సంకీర్తనలు ముగిశాయి. నగర సంకీర్తనలో పాల్గొన్న ఆవులకు మహిళలు పూజలు చేశారు. లంపకలోవ నగర సంకీర్తన కమిటీ సభ్యులను సొసైటీ మాజీ అధ్యక్షుడు గొంతిన సురేష్ ఘనంగా సన్మానించారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, శృంగవరం గ్రామాల్లోని శివాలయాలకు ఇంటిల్లిపాదీ తరలివచ్చి పాడ్యమి దీపాలను వెలిగించారు. వాటిని కాలువల్లో వదిలారు. దేవాలయాల్లో అరటి డొప్పల్లో నేతిదీపాలు వెలిగించి పూజలు చేశారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): ఏలేరు నదీతీరాన వేంచేసియున్న శ్రీరాజరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. అర్చకులు శేఖర్, కోడూరి మహేష్, వెంకటేష్ శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అరటి డొప్పలలో దీపాలు వెలిగించి ఏలేరు నదిలో వదిలిపెట్టారు.



లారీ యూనియన్ నూతన కార్యవర్గం

ఏలేశ్వరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్, కల్యాణ మండపం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా మట్టే సుబ్బారావు, అధ్యక్షుడిగా జ్యోతుల సత్యనారాయణ, కార్యదర్శిగా గొర్ల శివ, ఉపాధ్యక్షుడిగా వాకాడ కనకరాజు, సహాయ కార్యదర్శులుగా అట్టాడ ఆనందరావు, వడ్డాణపు లోవరాజులను లారీ ఓనర్స్, వర్కర్స్ కలిసి ఎన్నుకున్నారు. వైభోగుల సుబ్బారావు కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు సోమవారం ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ధర్మవరంలోని పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఉపాధ్యాయులను కలిసి తనకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల సంఘ నాయకులు పాల్గొన్నారు.

రాచపల్లిలో కార్తీక వనసమారాధన



వనసమారాధనలో అభిమానులతో ముద్రగడ

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి చినసారిపల్లి గంగాలమ్మ ఆలయం వద్ద గంగాలమ్మ యాదవ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక అన్న సమారాధన నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు,మాజీ డీసీసీబీ డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణంరాజు వేర్వేరుగా పాల్గొని గంగాలమ్మకు పూజలు చేసి వన సమారాధనలో పాల్గొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన ఐదు వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మిగంగరాజు, గంగాలమ్మ యాదవ కమిటీ సభ్యులు సారిపల్లి పెద్దకాపు, పెద్ద అప్పలరాజు, చక్రం, మండల ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీనివాసు, రామిశెట్టి రామకృష్ణ, కొప్పన గంగారావు, జగపతినగరం సర్పంచ్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం



అన్నం వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నేతృత్వంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమ వారం గండేపల్లికి చెందిన ఇనపకోళ్ల సంజీవరావు ఆర్థిక సహాయంతో ఉచిత అన్నదానం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై పేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, గండేపల్లి మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, నేతలు జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, బద్ది సురేష్, రాయిసాయి, కంటిపూడి రామయ్య, రెడ్డి సుబ్బారావు, నందిపాటి రాంబాబు, కోడూరి రమేష్, జీవీ రమణ, ఎండీ కాజా తదితరులు పాల్గొన్నారు.

'పట్టణ ప్రణాళికా విభాగంలో సమస్యలను పరిష్కరించాలి'



యనమలను సత్కరిస్తున్న ఇంజనీర్లు

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణ ప్రణాళికా విభాగంలో సమస్యలను పరిష్కరించి సిబ్బంది నియామకానికి చొరవ చూపాలని తుని ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్యలను కోరారు. సోమవారం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇద్దరు నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన వీరు సంబంధిత సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కొండ్రపు రామకృష్ణ, సెక్రటరీ వైఎస్సార్ కృష్ణ, స్టేట్ ఈసీ మెంబర్ సుభాష్, డైరెక్టర్ తేజోమూర్తుల శ్రీనివాస్, ప్రసాద్, పైడిరాజు, కైలాస గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో టీడీపీ కార్యకర్త మృతి



శంఖవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) టీడీపీ కార్యకర్త కొయ్యా వీరసత్యనారాయణ (51) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. సత్యనారాయణ చంద్రబాబు, లోకేశ్, యనమల రామకృష్ణుడు, యనమల దివ్య, వరుపుల సత్యప్రభలతో పాటు పార్టీ ముఖ్యుల కార్యక్రమాలు జిల్లాలో ఎక్కడ జరిగినా సోషల్ మీడియాలో ప్రచారం చేసేవాడు. సినీ నటుడు బాలకృష్ణ అభిమాన సంఘం నాయకుడిగా పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. సత్యనారాయణ మృతికి ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలతో పాటు కత్తిపూడి పరిసర ప్రాంత టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రంపచోడవరం గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థలో అవినీతి

మంత్రి నారా లోకేశ్‌కు ఆదివాసీ సంక్షేమ సంఘం ఫిర్యాదు

రంపచోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ విద్యావ్యవస్థ అవినీతి కంపు కొడుతోందని, మంచి విద్యనందించలేని పరిస్థితులే కాకుండా గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యాన్ని సైతం గాలికి వదిలేశారని పేర్కొంటూ మంత్రి నారా లోకేశ్‌కు ఆదివాసీ సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. రంపచోడవరం ఐటీడీఏకు అనుబంధంగా నడుస్తున్న గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థకు చిత్తశుద్ధి కలిగిన అధికారులు కరువయ్యారని, ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్ పోస్టును ప్రభుత్వం కొన్నేళ్లుగా భర్తీ చేయట్లేదన్నారు. అనర్హులకు కూడా ఈ బాధ్యత అప్పగించారని, తద్వారా గిరిజన విద్యాలయాలపై పర్యవేక్షణ కరువైందన్నారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు ప్రతి గిరిజన సంక్షేమ విద్యాలయం, వసతి గృహం నుంచి నెలవారీగా లంచాలను ఏర్పాటు చేసుకుని గిరిజన విద్యార్థులకు సరైన విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం కూడా ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి ఇక్కడి సమస్యలన్నిటినీ ఏకరువు పెట్టారు. సహాయ గిరిజన సంక్షేమాధికారుల వసూళ్ల దందాను మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు.

టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

రంపచోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ట్రేడ్ యూనియన్‌కు అనుబంధమైన ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుడు లండా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కె.ఆదిరెడ్డి ఎన్నికయ్యారు. టీఎన్‌యూఎస్‌ను పటిష్టపర్చడంలో భాగంగా రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు అల్లూరి గిరిజన జిల్లాకు కూడా కమిటీని ఏర్పాటు చేశారు.



'సముచిత స్థానం'

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికి టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని ప్రభుత్వ విప్, తుని ఎమ్మె ల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. మన టీడీపీ యాప్‌లో నిరంతరం పనిచేసి మంగళగిరిలోని పార్టీ కార్యాలయం నుంచి బెస్ట్ పేమెంట్స్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్న తుని నియోజకవర్గానికి చెందిన పది మంది కార్యకర్తలు ఎమ్మెల్యే దివ్యను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఆమె అభినందించారు.

స్త్రీనిధి సొమ్ముల స్వాహాపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

కిర్లంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడిలో స్త్రీనిధి సొమ్ములు స్వాహా ఘటనపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన యానిమేటర్ స్త్రీ నిధికి చెందిన సుమారు రూ.22లక్షలు మాయం చేసిందని డ్వాక్రా సం ఘాల మహిళలు గగ్గోలు పెట్టడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి ఆదేశాల మేరకు విచారణ నిర్వహించారు. డ్వాక్రా గ్రూపు సభ్యులను కాకినాడ జిల్లా స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, ఏపీ ఎం వేదకుమారి విచారించారు. సభ్యుల వద్ద నుంచి పూర్తి వివరాలు సేకరించి జిల్లా ఉన్న తాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు.

తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

జగ్గంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సర్కిల్ పరిధిలో తాగి వాహనాలు నడుపుతున్న పది మందిని పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. ఇద్దరికి రూ.10వేలు చొప్పున రూ.20వేలు జరిమానా విధించారు. ఎనిమిది మందికి రెండు రోజులు జైలు శిక్ష విధించి పెద్దాపురం సబ్ జైలుకు తరలించారు. తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ వైఆర్కే శ్రీనివాస్ హెచ్చరించారు.

20లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించి 20లీటర్ల సారాతో ఇద్దరిని అరెస్టు చేశారు. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో 10 లీటర్ల సారాతో దాకే సుబ్బలక్ష్మి, మరో 10 లీటర్ల సారాతో వీధి చిన్నోడులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ పి.వంశీరాం, సిబ్బంది పాల్గొన్నారు.



తొండంగిలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న తహసీల్దారు మురార్జీ

నీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ

తొండంగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో 16 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించి 120 మంది సిబ్బందికి సోమవారం తొండంగి ఉన్నత పాఠశాలలో తహసీల్దారు మురార్జీ శిక్షణ ఇచ్చారు. ఈ నెల 5న నోటిఫికేషన్ జారీ అనంతరం చేపట్టవలసిన చర్యలు, పోలింగ్ జరిగే 8వ తేదీన తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎన్నికల విధుల నిర్వహణ మార్గదర్శకాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని కోరారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని తహసీల్దారు సుభాష్ పేర్కొన్నారు. సోమవారం కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో 11 మేజర్, 10 మైనర్ నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆయా సంఘాల్లో 18వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 8న పోలింగ్ జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణ, వ్యవసాయధికారి చంద్రశేఖర్, మేజర్ ఇరిగేషన్ ఏఈ దుర్గాబాబు, మైనర్ ఇరిగేషన్ ఏఈ వరుణ్, డిప్యూటీ తహసీల్దారు పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



డి.పోలవరం వద్ద నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న దృశ్యం

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం ఏరువాక కేంద్రం పెద్దాపురం సమన్వయకర్త డాక్టర్ సీతారామశర్మ పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి తగు సూచనలు ఇచ్చారు. ఎక్కడైతే వరి పంట ఒరిగిందో దాన్ని కట్టలు కట్టుకోవాలని, ధాన్యం మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంట గింజ దశలో ఉంటే తెగుళ్ల సోకకుండా కార్బండిజమ్, మ్యాంకోజెబ్ శిలీంద్రనాశినిని ఒక లీటరు నీటిలో ఒకటిన్నర గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు.

మాల కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందన

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్తాబత్తుల అప్పారావును టీడీపీ ఎస్సీ సెల్ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు వి. నారాయుడు, నాయకులు నామాడి వాల్టస్, రాపా నూకరాజు, ముడదా చిన్ని, సుబ్రహ్మణ్యం అభినందించారు.